# స్వర్ణయుగం

డా॥ కాలువ మల్లయ్య

[illegible] అతని కళ్ల [illegible]

[illegible] భలే [illegible] అన్నాడు ఆనందరావు. నవ్వుతూ [illegible]

[illegible] చూస్తున్నాడు వెంకట్రెడ్డి. తన మాటల్లో అంతగా నవ్వాల్సిందేముందో వెంకట్రెడ్డి అర్థం కావడం లేదు.

"ఏంటానందరావ్ అంతగా నవ్వుతున్నావు? నీకేమన్న పిచ్చా? నా మాటల్లో అంత జోకేముంది?" గట్టిగా అన్నాడు.

నవ్వడం ఆపాడు వెంకట్రెడ్డి.

"జోక్ కాకుంటేంది వెంకటరెడ్డీ! నువ్వు మాట్లాడుతున్నది ఓ మాదిగోడితో నన్నది మరచిపోకు. ఈ దేశంలో ఓ అంటరానివాడికి రాజపూజ్యమా-? ఆ పంచాంగాలు మా కోసం రాసినవి కావు వెంకటరెడ్డీ, మీ కోసం రాసుకున్నవి. మేం మీ చాతుర్వర్ణాలలోనూ లేం కదా! పంచముడికి పంచాగమేంటి? అందుకే నవ్వాగడం లేదు."



ఆ మాటల్లోని విషాదం గొంతులోని జీర వెంకటరెడ్డి గమనించలేదు.

"నిన్ను నువ్వెందుకంత తక్కువ చేసుకుంటున్నావ్? దళితుడంటే అవమానాలే అనుకోవడం. ఆత్మన్యూనతా భావం కాదా?"

"ఆత్మన్యూనత కాక భుజా లేగరేసుకొని చెప్పడానికి మా కేముందని ఈ దేశంలో?"

"రాచరికవ్యవస్థకాలం నాటి విషయాల గూర్చి చెబుతున్నావు నువ్వు. ఇరవయవ శతాబ్దిలో దేశాలన్నీ రాచరికబంధాల నుండి ప్రజాస్వామికయుగంలోకి అడుగు పెట్టాయి. నా ఉద్దేశ్యంలోనైతే ఇరవయవ శతాబ్ది పీడితులకు స్వర్ణయుగం లాంటిదే."

వెంకటరెడ్డి మాటలకు మళ్లీ పగలబడి నవ్వుతున్నాడు ఆనందరావు. "స్వర్ణయుగమా? అంటేంటి? స్వర్ణయుగ మంటే?" అన్నాడు...

"నువ్వు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్వన్న విషయం మరచిపోకు.. స్వర్ణయుగ మంటేదో తెలియదా.. ఎందుకలా నవ్వడం?" కొంచెం కోపంగా అన్నాడు వెంకటరెడ్డి

"ఎందుకో చెప్పనా?"

"చెప్పమనే కదా నేనంటున్నది!"

"మనం చరిత్ర చదువుకున్నాం కదా!"

"అవును చదువుకున్నాం."

"చరిత్రలో ఏ కాలాన్ని స్వర్ణయుగ మంటారు?"

"గుప్తుల కాలాన్ని..."

"అంటే? గుప్తుల కాలాన్ని స్వర్ణయుగ మంటావ్?"

"అనే కదా మనం చదువుకున్నది."

"ఇది మరో పెద్ద జోక్ తెలుసా...?"

ఆ మాటకు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు వెంకటరెడ్డి. "ఎందుకిలా మాట్లాడుతావ్ ఆనందరావ్. ప్రతిదానికీ వ్యంగ్యమేనా?" అన్నాడు

"అది మీలాంటి వాళ్లకు స్వర్ణయుగం అయితే అయియుండొచ్చు. ఆ కాలంలో సాహిత్యం కళల వికాసం బాగానే జరిగి ఉండవచ్చు. కాని దళితులకు మాత్రం అది చీకటియుగమే. అపుడే మన సమాజంలో అంటరానితనం స్వీకరింపబడింది. మాలమాదిగలను ఊరి బయట ఉంచడం కూడా అప్పుడే జరిగింది. ఈ విషయం ఆ కాలానికి మచ్చ లాంటిదే... అందుకే గుప్తయుగాన్ని స్వర్ణయుగ మంటే నవ్వా లనిపిస్తుంటుంది."

ఆనందరావు మాటల్లోని వేదనను, ఔచిత్యాన్ని గురించి ఆలోచిస్తున్నాడు వెంటకరెడ్డి.

"ఇరవయవ శతాబ్దానికి రాచరికవ్యవస్థ నుండి ప్రజాస్వామిక వ్యవస్థలకు మారిన కాలం అన్నమాట వాస్తవమే. అయినా పీడితజాతులు ఆ కాలాన్ని స్వర్ణయుగం అని కీర్తించేంత సీనేం లేదు. ముఖ్యంగా ఈ దేశంలోని దళితుల కొరిగిందేంటన్నదే నా ప్రశ్న. చాలా ప్రాంతాన్ని మొన్నమొన్నటి వరకు, కొన్ని ప్రాంతాలన్ని ఇప్పటికి కూడా దళితులకు చదువు అందని మానిపండే. మేం ఎదుర్కొంటున్నవి అవమానాలే. రాజాధికారంలో కాని, తమ వాటా పొందడం విషయంలో కాని తమ వాటా ఇప్పటికే అనుభవించడం లేదు. ఇంకా అంటరానితనం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కొన సాగుతుంటే మారింది మారిందని భుజాలు చరుచుకొమ్మంటావా? ఒకప్పుడు అమెరికాలో కొన్ని చోట్ల నో ఎంట్రీ ఫర్ డాగ్స్ అండ్ బ్లాక్స్ అన్న బోర్డును చూసి భారతీయులెంత బాధ పడ్డారు? మరీ దేశంలో నో ఎంట్రీ ఫర్ దళిత్స్ అన్నది ఎన్నో రంగాల్లో ఇప్పటికే కొసాగుతూంది కదా...

"అమెరికన్లు నీగ్రోల పట్ల తాము ప్రవర్తిస్తు తీరుకు కొంతయినా క్షమాపణలు చెప్పుకున్నారు. మరీ దేశంలో వేలాది సంవత్సరాలుగా దళితులపై చూపుతున్న వివక్షకు క్షమాపణలు చెప్పుకుంటారా? ఏం చేస్తే ఈ బాకీ తీరుతుంది? ఎన్నటికైనా మనవాళ్లు పశ్చాత్తాపం ప్రకటించే అవకాశం ఉందా? అయినా సరే మేం గొప్పగా ఉన్నామని, బాగా జరుగుతుందని ఇది స్వర్ణయుగమేనని మురిసిపోతుంటావా? చెప్పు వెంకటరెడ్డీ! చెప్పు..." నిలదీసినట్టు ప్రశ్నించాడు

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం -
ఎ.పి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో
రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ

ఆనందరావు...

"ఆనందరావ్! నువ్వు బాల్యంలో పొందిన అవమానాలు, అనుభవించిన జీవితం నీతో ఇలాంటి మాటలు అనిపించడంలో ఆశ్చర్యమేం లేదు. కాని పరిస్థితు లింకా అలాగే ఉన్నాయనుకోవడం పొరపాటు. సహజపరిణామాలతో మాటలతో కొంత, వివిధ పోరాటాలతో మరి కొంత పీడిత వర్గాల వారు కొన్నయినా హక్కులు సాధించు కోగలిగారు. చదువుకొని జీవితాలనూ గెలుచుకోగలిగారు. అలా కాకుంటే నువ్వు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ స్థాయికి ఎలా ఎదగగలిగేవాడివి? నువ్వు చాలా కాలం నుంచి ఊరితో సంబంధాలు తెంచుకు న్నట్టున్నావు కాబట్టి నీకు మార్పులు పూర్తిగా అర్థమయ్యుండకపోవచ్చు."

"అలాగా! అయితే నన్నేం చేయ మంటావు?"

"మన మిక్కడ మంచి స్నేహితులం. కాని, నువ్వెప్పుడూ మా ఊరికొచ్చింది లేదు. ఈ సారి నువ్వు నాతో వస్తే ఇద్దరం ఉగాది అక్కడే చేసుకుందాం. మా ఇంట్లో, నా పక్కనే గడపాలి నువ్వు. వస్తావా ఆనందరావ్?"

ఆ మాటలకు పకపకా నవ్వసాగాడు ఆనందరావు. కొద్ది సేపు నవ్వి ఆగి పోయాడు. "నేను మీ ఇంటికి రావడమా? ఆ పల్లెటూళ్లో నీ పక్కన కూచొని భోజనం చేయడమా? భలే జోక్.! నువ్వు రెడ్డివి, నేను మాదిగోన్నన్న విషయం మరచిపోకు. ఓ మాదిగాయన రెడ్డింట్లో అదీ పల్లెటూళ్లో ఆడవాళ్లు వడ్డిస్తుంటే తినడమా? ఇదీ దేశంలోని మాటేనా? ఇదైతే నాకీ శతాబ్దపు జోక్ అనిపిస్తుంది..." అని నవ్వుతూనే ఉన్నాడు ఆనందరావ్.

"ఏమైంది ఆనందరావ్ నీకీ రోజు? ప్రతి మాటకూ నవ్వుతున్నావేంటి? నీ మాటలు అతిశయోక్తులు కాకపోతే దళితుడు రెడ్డి ఇండ్లలో కూచొని భోజనం చేయడం లేదా? కలిసి తిరగడం లేదా?" కొంచెం కోపంగా అన్నాడు వెంకటరెడ్డి.

"నేను చెప్పేది పట్టణాల గురించి కాదు. పల్లెల గురించి ఫ్యూడల్ కేంద్రాల గురించి. పట్టణాలల్లోనూ అప్రకటిత అంటరానితన ముంది. పట్టణాల్లోనైనా పల్లెల్లోనైనా ఏదో మార్పులు వచ్చినట్టు కనడినా అస్పృశ్యతను అనుభవిస్తున్న వాళ్లకు తెలుసు అందులో ఎంత వేదనుందో. మన, మన తల్లిదండ్రుల తరాల్లో ఊళ్లలో ఇప్పటికీ వీడూ మనతో తిరిగే వాడా అన్నభావం స్పష్టంగానే కనబడుతుంది. మా పై ఏహ్య భావం, తృణీకరణ ఎంత దారుణంగా ఉంటాయో నీకు తెలియకపోవచ్చు. కాని, అనుభవించిన, అనుభవిస్తున్న మాకు తెలుసు..." చివరి మాట లంటున్న ఆనందరావు కంఠం గద్గదమైంది.

"అంటే నువ్విప్పుడు నాతో మీ ఇంటికి రానంటావు?"

"రాలేను వెంకట్రెడ్డీ! నాకింకా అలాంటి అవమానాలను భరించే శక్తి లేదు. నా బాల్యం, యవ్వన మంతా అలాంటి అవమా నాలతోనే గడిచిపోయింది. ఇప్పుడు యాభై దాటి వార్ధక్యంలోకి అడుగు పెట్టాను. ఇప్పుడూ వాటిని భరించే సామర్థ్యం నాకు లేదు. నా పిల్లలను నేననుభవించిన ఫ్యూడల్ సంస్కృతికి దూరంగా పెంచుతున్నాను. నా అవమానాల జాడ తెలియకుండా పెంచుతు న్నాను. అవి మళ్లీ నా అనుభవంలోకి రానీయను! ఎన్ని అవమానాలు భరించాను వెంకట్రెడ్డి, ఎన్ని అవమానాలు!" అని గట్టిగా కళ్లు మూసుకున్నాడు ఆనందరావు. అతని కనుకొలుకుల్నుండి జారుతున్న నీటి బిందువులు వెంకటరెడ్డి దృష్టిని దాటిపోలేదు.



"నిన్నంత వేదనకు గురి చేసిన సంఘటన లున్నాయా ఆనందరావ్? తలచుకుంటేనే ఇంత బాధ కలుగుతుంటే ప్రత్యక్షంగా నువ్వెంత బాధననుభవించుంటావు! నిన్ను బాధపెట్టాలని కాదు గాని నిన్నింత వేదనకు గురి చేసిన ఒకటి రెండు సంఘటనలు చెబుతావా?"

"తప్పకుండా వెంకట్రెడ్డీ. ఆకలి ఈ దేశంలోనైనా ఏ దేశంలోనైనా దుర్మార్గమైనదే కావచ్చు కాని, ఆకలి కంటే ఆత్మగౌరవం మరీ ముఖ్యం. ఓ పూట తిండి లేకున్నా బతకొచ్చు గాని ఆత్మగౌరవాన్ని వదులుకొని బతకడం చాలా కష్టం. కమ్యూనిస్టులనే ఆర్థికం ఒక్కటే సర్వరోగనివారిణి అనేదాన్ని నేనొప్పుకోను వెంకటరెడ్డీ! ఈ దేశంలో దళితులు ఎన్నెన్ని అవమానాలకు గురవుతు న్నారో నీకు తెలియదా? జగజ్జీవన్ లాంటి వాణ్నే గుళ్లోకి రావడానికి అడ్డుకున్నారంటే అంత కంటె పెద్ద ఉదాహర ణేముంటుంది? ఆత్మగౌరవం లేని బతుకు వృథా రెడ్డీ. నేననుభవించిన అవమానాల భారంతో నా తల పండిపోయింది" అని గట్టిగా కళ్లు మూసుకున్నాడు ఆనందరావ్.

అతని మనసు నాలుగు దశాబ్దాల గతంలో కరీంనగర్ జిల్లాలోని తన ఊళ్లో విహరిస్తూంది.

బతుకమ్మ పండుగ రోజులు... ఊరు ఊరంతా బతుకమ్మ పండుగ సంబరాల్లో మునిగితేలుతున్నారు. సద్దుల పండుగ వచ్చింది. దొరగారి గడీ ముందు విశాలంగా ఉన్న ఖాళీస్థలంలో బతుకమ్మలను తెచ్చిపెడుతున్నారు. బతుకమ్మ పాట మొదలైంది... ఆనందంగా పాడుతున్నారు.

మాదిగవాళ్లకు మాత్రం బతుకమ్మాడుకునే అవకాశం లేదు.. గుళ్లోకి వెళ్లే అవకాశం అంత కంటే లేదు.. దూరంగా నిల్చొని బతుకమ్మలను చూడాలి. ఊరిదొరలకు పువ్వులైతే తెచ్చివ్వాలి. దళితు లొచ్చి ఖాళీ స్థలంలో దూరంగా నిల్చుని బతుకమ్మను చూస్తున్నారు. అందులో ఆనందరావూ ఉన్నాడు. ఆ మూడు బజార్ల స్థలమంతా జనంతో నిండిపోయింది.

బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతున్నారు స్త్రీలు. లయబద్ధంగా చప్పట్లు కొడుతున్నారు. అందులో దొరల కుటుంబాల స్త్రీలతో పాటు వివిధకులాలకు చెందినవాళ్లూ ఉన్నారు. మరి కొంచెం సేపు ఆడిన తర్వాత బతుకమ్మలను లేపారు. అందరూ ఒకేసారి లేపేసరికి ఒత్తిడి మొద లైంది. తొక్కిసలాటయింది. దళితులు వెనక్కి జరిగారు. ఆ తొక్కిసలాటలో ఆనందరావు దొరసానిని తగిలాడు.

ఆగ్రహంతో దొరలంతా ఉరికొచ్చారు. పన్నెండేళ్ల పసివాడు ఆనందరావు చుట్టూ మూగారు. దొరల కోపాన్ని చూసి గజగజా వణికిపోతున్నాడు ఆనందరావు...

"నువ్విక్కడి కెందు కొచ్చినవురా?" గద్దించాడో దొర.

"బతుకమ్మలను చూడటానికి..."

"మాదిగోనివి. దొరగారి గడి ముందు కస్తవు... బతుకమ్మలను చూస్తవు... నిన్నెవడు రమ్మన్నడురా ఇక్కడికి?"

"మాకు బతుకమ్మలాటుంటది గద...

సూత్తామనచ్చిన."

"మాదిగోల్లు బతుకమ్మాడుతార్ర?" వెకిలిగా నవ్వాడో దొర.

"సరెగాని దొరసాని నెందుకు తాకినవు?"

"నేను చూల్లేదు దొర. దూరంగానే నిల్చున్న."

"అంటె? దొర్సానొచ్చి నిన్ను తాకినాదిర?" అని చెప్పు తీసి ఇష్టమున్నట్టు కొడుతున్నాడు దొర. బూతులు తిడుతున్నాడు. అవమానకర మైన తిట్లు తిడుతున్నాడు. దళితులంతా భయంభయంగా చూస్తున్నారు...

"ఎందుకు కొడుతున్నారు దొరా?" అని అడిగే ధైర్యం ఎవరికీ లేదు.

ఆనందరావుతో వచ్చిన పిల్లలు భయంతో పరుగెత్తుకెళ్లారు.

తనేం తప్పు చేశాడు... అంతగా కొడుతున్నారు, తిడుతున్నారు? ఆనందరావు కి అర్థం కావడం లేదు. ఏడుస్తూనే "ఏంది దొరా! ఎందుక్కొడుతున్నారు?" అన్నాడు.

"మాట్లాడుతున్నావుర ఇంకా మాదిగోని కట... ఆనందరావని పేరట... చదువట... బడట... ఏదో... ఏడో తరగతి చదు వుతున్ననని పొగరట... నువ్వేం చదివినా మా ఎంటికకు కొరగావురా..."

వంశాన్నంతా వల్లిస్తూ బూతులు కక్కుతు న్నాడు దొర. ఏడుస్తున్నాడు ఆనందరావు గడగడా ఏడుస్తున్నాడు. అవమానభారంతో కుంగిపోతున్నాడు తనేం మాట్లాడినా ఫలిత మేంటో అతనికి తెలుసు. అందుకే ఏం చేసినా భరిస్తున్నాడు. దొరను ప్రోత్సహిస్తున్న వాళ్లే కాని ఆనందరావుకు మద్దతుగా మాట్లాడేవారెవరూ లేరు.

"గీ సంగతెరికేనా నీకు గోపాల్‌రెడ్డి? వీని తండ్రి నా దగ్గర పాలేరుండె. నా కొడుకును చదించుత దొరా అన్నడు. మాదిగోనికి చదువెందుకురా అని మా తిట్టిన. అయినా బడికి తోలుతున్నాడు. చదువుకోని ఏం బీకుతాడట మాదిగోడు రాజ్యాలేలుతడా? హి...హి...హి..." అని నవ్వుతూ అన్నాడు దొర. పిల్లవాడని కూడా చూడకుండా విపరీతంగా కొడుతున్నాడు.

"పోరాడు చస్తడు....పోనియ్ దొరా...ఇక చాలు..."

పట్వారనగానే "గాడ్దీ కే.." అని ఒక తన్ను తన్నాడు.

ఊరవతల ఆడే బతుకమ్మలను చూడటానికి కాకుండా ఏడుస్తూ ఇంటి కెళ్లాడు ఆనందరావు.

ఆనందరావు, అతని కుటుంబం, కులం వాళ్లు ఇలాంటి, ఇంత కంటె ఘోరమైన అవమానా లెన్నింటినో పొందారు. ఉద్యోగం లో చేరిన తర్వాత కూడా అవమానాలు తప్పలేదు. పైకి కనిపించే వివక్ష కొంతయినా, కనపడని వివక్ష మరింత... గవర్నమెం టల్లుండ్లని, రిజర్వేషన్‌గాల్లని దెప్పిపొడవడం, చేయని తప్పులకు బాధ్యులను చేయడం, అతి చిన్న తప్పును కూడా కొండంత చేసి చూపడం లాంటి అవమానాలకు లెక్కే లేదు.

గతం తాలూకు జ్ఞాపకాలతో ఆనందరావు హృదయం బరువెక్కింది.

000

"ఎన్నని చెప్పాలి వెంకట్రెడ్డీ! అయినా దళితుల పరిస్థితి నీకు తెలియందేముంది?" అని కళ్లు తుడుచుకున్నాడు ఆనందరావు.

"అవన్నీ కాదనడం లేదు ఆనందరావ్! కాని అవన్నీ మన చిన్నతనంలో ఫ్యూడల్ భావాల ఉద్ధృతి ఉన్న సమయంలో జరిగి

**వీళ్ల మాటల్లో కృత్రిమత్వం కనబడింది ఆనందరావుకు. వాళ్లెవరూ ఆనందరావును పలుకరించకపోవడం గమనించాడు వెంకటరెడ్డి. ఆనందరావు ఇంట్లో కనపడి నప్పుడల్లా వృద్ధురాలి ముఖంలోనూ, వాళ్ల ముఖాల్లోనూ ప్రశార్థకాలు చూస్తున్నా రిద్దరూ.**

వుండవచ్చు. ఆ పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయని నేననుకోను. ఫ్యూడల్ వ్యవస్థ మంచిదని నేననడం లేదు కాని అందులో ఉన్న కాస్త మంచి కూడా పోయిందేమో ననిపిస్తుంది నాకు."

"అందులోనూ నీకు మంచి కనబడిందా వెంకట్రెడ్డి! కనబడుతుంది. ఎందుకంటే నువ్వా కుటుంబం లోంచి వచ్చినవాడివే కదా! మాజీ దొరల కుటుంబం కదా మీది.

"మంచి అంటే ఆప్యాయతలు, అను రాగాలు, ప్రేమలు, రూపాయి ప్రవేశంతో మటుమాయమై పోతున్నాయన్నదే నా ఆరోపణ. అవన్నీ పోనీ కాని నువ్వు నాతో మా ఊరికి, మా ఇంటి కొస్తున్నావా, లేదా?"

కొద్దిక్షణా లాలోచించాడు ఆనందరావు. ఒక్క షరతుపై వస్తాను."

"ఏంటో చెప్పు షరతు?"

"మా ఊరు మీ ఊరికి ఇరవై కిలో మీటర్ల దూరంలోనే ఉంది కదా! మీ ఇంటి నుంచి మా ఇంటికి రావాలి నువ్వు అట్లయితే నేనొస్తాను."

"తప్పకుండా వస్తాను రేపే మన ప్రయాణం" అన్నాడు వెంకట్రెడ్డి.

000

గ్రామంలో వెంకటరెడ్డి ఇంటి ముందు కారాగింది. కార్లోంచి దిగుతున్నారు ఆనందరావు, వెంకటరెడ్డి.

"ఎవరే సులోచనా వచ్చింది.?" అంది అరుగు మీద మంచంలో పడుకోనున్న రాందేవమ్మ... వెంకటరెడ్డి తల్లి.

'అన్నయ్య వచ్చిండే అమ్మ...' అంది సులోచన.

మంచంలో నుంచి లేచి కూర్చుంది రాందేవమ్మ.

వెంకటరెడ్డి అరుగెక్కి తల్లి మంచం దగ్గరి కెళ్లాడు. తల్లి పక్కన కూర్చున్నాడు.

"వచ్చినవా బిడ్డ, ఆయనెవరు?" అంది కొడుకు మీద చేయేస్తూ.

'నా స్నేహితుడు ఆనందరావ్!"

కనుబొమ్మల కడ్డంగా చెయ్యిపెట్టుకుని చూసిందా వృద్ధురాలు. ఆమె భ్రుకుటి ముడి పడింది. 'పండుగ కచ్చినవా బిడ్డ... మంచిదే.. కోడలు మంచిగుందా?"

"మంచిగనే ఉందే అమ్మ... నీ ఆరోగ్యం బాగుంది గద."

'ఎప్పుడొచ్చినవు బావా!' అంటూ ఇంట్లోకి ప్రవేశించాడు రాజిరెడ్డి. పండుగకు వచ్చినవు సంతోషం."

వీళ్ల మాటల్లో కృత్రిమత్వం కనబడింది ఆనందరావుకు. వాళ్లెవరూ ఆనందరావును పలుకరించకపోవడం గమనించాడు వెంకటరెడ్డి. ఆనందరావు ఇంట్లో కనపడి నప్పుడల్లా వృద్ధురాలి ముఖంలోనూ, వాళ్ల ముఖాల్లోనూ ప్రశార్థకాలు చూస్తున్నా రిద్దరూ.

బూరెలు... పిండివంటలు... రుచికరమైన మాంసాహారం... తీపి... ఇతరాలతో ఉగాది, మరో రోజు గడిచింది.

"మన వ్యవసాయం ఎలా ఉంది బావా?" అన్నాడు వెంకటరెడ్డి.

"ఫరవాలేదు నడుస్తుంది."

"మరి నీ గ్రామరాజకీయాలో?"

"అవీ ఫరవాలేదు... నేను ఉపసర్పంచ్‌నిప్పుడు..."

"ఏం, సర్పంచి వెందుకు కాలేకపోయావు.?" అడిగాడు ఆనందరావు.

"రిజర్వేషన్లంటూ ఏడ్చినయ్ గద. ఈ సారి సర్పంచి మాదిగమాల్లోలకు కిచ్చిండ్రు. వాడు సర్పంచయితే నేను ఉపసర్పంచ్" అన్నాడు రాజిరెడ్డి

తల్లి చేతిలో వెయ్యి రూపాయలుంచాడు వెంటకరెడ్డి. వెంటనే వాటినామె బిడ్డకిచ్చింది.

అందరికీ వీడ్కోలు చెప్పి అక్కడి నుంచి

బయలుదేరారు వాళ్లు.

గంట లోపే కారు ఆనందరావు ఊరు చేరుకుంది. దళితవాడలో కారాగింది. ఆనందరావు, వెంకట్రరెడ్డి కారు దిగారు. ఆనందరావు తల్లిదండ్రులు ఎదురొచ్చారు. కొడుకుని దగ్గరకు తీసుకున్నారు.

"గీ దొరెవ్వరు?" అడిగాడు ఎల్లయ్య

"నాతోని ఉద్యోగం చేస్తాడు... ప్రొఫెసర్ వెంకటరెడ్డి..."

"పట్నంల మీ ఇంటి పక్కనుంటడు గదా! గీ దొర మనింటి కొచ్చిందా?"

సంబరపడిపోతూ అంది లసుమమ్మ...

'కాళ్లకు నీళ్లియ్యే పిల్ల...' మనుమరాలిని కేకేశాడు ఎల్లయ్య.

"ఈమె మా చెల్లె కూతురు. ఇక్కడే చదువుకుంటూ మా అమ్మానాన్నలకు తోడుగా ఉంటుంది."

'దొర మనింటికి వచ్చిండు.. దొరచ్చిండు" సంబరపడిపోతున్నారు వాళ్లు.

"నీలమ్మా! కోడ్ని దొరకవట్టే..." అన్నాడు ఎల్లయ్య...

"ఉన్నది వండుతల్లీ! కోడి వద్దేమద్దు."

"నా కొడుకచ్చిండు. దొరవు నువ్వచ్చినవు. పప్పుతోని పెట్టమంటవా బిడ్డ?"

కోడ్ని గొసుడే..."

"వెంకటరెడ్డి. మనమేం చెప్పినా వాళ్లు వినరు. నేనొస్తేనే చుట్టమొలె చూసుకుంటరు. ఇప్పుడు నువ్వు కూడా ఉన్నావు కదా!" అని నవ్వాడు ఆనందరావు.

వాళ్లు చూపుతున్న ఆప్యాయతకు కరిగిపోతున్నాడు వెంకటరెడ్డి. తననో అపురూపమైన వ్యక్తిగా చూడటం అతనికెంతో ఆనందంగా ఉంది.

ముసలి వాళ్లిద్దరూ దగ్గరుండి వడ్డిస్తున్నారు.

"మాకు సరిగ్గ వంటరాదు. వంటెట్లుందో ఏమొ. కడుపు నిండ తినుండ్రి బిడ్డ..." బాగా తినిపించాలని ఆరాటపడుతున్నారు వాళ్లు.

తమ ఇంట్లో వండిన వంటతో పోలిస్తే తక్కువ రుచిగానే ఉన్నా ఆ వంటలో ఏదో ప్రత్యేకతున్నట్లు గమనించాడు వెంకటరెడ్డి. ప్రేమ రంగరించి వండినట్టున్నయి పదార్థాలు. కడుపు నిండా తిన్నాడు వెంకటరెడ్డి.

తెల్లవారి వెళ్లిపోతామన్న కొడుకును చూసి ముఖం మాడ్చుకున్నారు ఎల్లయ్య, లసమమ్మ.

"ఇంక రెండు రోజు లుండుండ్రి. దొరెండుకస్తడు మనింటికి?" అన్నారు.

"వాళ్లంత బలవంతం చేస్తున్నప్పుడు పోవుడెందుకు? ఆగుదాం."

వెంకట్రెడ్డి మాటలకు సరే నన్నాడు ఆనందరావు.

ఆ వృద్ధుల ముఖాల్లో అంతులేని ఆనందం చూశాడు వెంకటరెడ్డి

"మీరు మా కోసం కష్టపడకుంటేనే ఉంటం. దొరికింది వండాలె. ఆరాటపడవద్దు" అన్నాడు.

"గట్లెందుకంటవు బిడ్డ... మీకు వండిపెట్టడం మాకు కష్టమైతదా? మీరు మంచిగ, కడుపు నిండ తింటేనే మాకు సంతోషం" అంది లసుమమ్మ

చేపల కూర వండింది లసుమమ్మ. వంట బాగా ఉందో లేదోనన్నభయం. వచ్చినవాళ్లకు మంచి తిండి పెట్టాలన్న ఆరాటం...

"మంచిగుందా బిడ్డా... మంచిగుందా?" చాలా సార్లడిగింది.

'బ్రహ్మాండంగా ఉందమ్మా!" అన్నాడు వెంకటరెడ్డి.

మరునాడు వెళ్లి పోయేప్పుడు ఆ వృద్ధులు చూపిన ప్రేమానురాగాలు వెంకటరెడ్డి ఎన్నటికీ మరచిపోలేదు.

వారం రోజులు గడిచినాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రవిభాగం స్టాఫ్ రూపంలో కూర్చున్నారు ఆనందరావు, వెంకటరెడ్డి.

"వెంకట్రెడ్డీ! మళ్ళెప్పుడు పోదాం మీ ఊరికి?" అన్నాడు ఆనందరావు.

ఆ మాటల్లో వ్యంగ్య ముందేమోనని వెతికాడు వెంకట్రెడ్డి.

ఆ జాడలేం కనపడలేదు.

"ఆనందరావు, నిన్ను మా ఇంటికి రమ్మని ఇంకెప్పుడూ పిలువను. నువ్వొచ్చినా వద్దంటాను. కాని, నువ్వు పిలువకున్నా మీ ఊరి కొస్తాను. మీ ఇంట్లో ఉంటాను. మీ అమ్మ చేతి వంట తింటాను."

వెంకటరెడ్డి మాటకు ఆశ్చర్యచకితుడు కావడం ఆనందరావు వంతయింది.

"ఏంటి రెడ్డీ, అట్లంటున్నావు!" అన్నాడు.

"నువ్వు నన్ను మీ ఇంటి కెందు కాహ్వానించావో అప్పుడర్థం కాలేదు. కాని ఆహ్వానించి ఉండకపోతే నేనెంతో కోల్పోయి ఉండేవాణ్ని. అక్కడ గడిపిన రెండురోజుల్లో నిజమైన ప్రేమంటే ఏంటో తెలుసుకున్నాను. నిష్కల్మషహృదయాలెలా ఉంటాయో అర్థం చేసుకున్నాను. మా ఇంట్లో, మీ ఇంట్లో గడిపిన జీవితంతో నా అభిప్రాయాల్లో చాలా మార్పులొచ్చాయి. అవును ఆనందరావ్, నువ్వన్నట్లు మీకు రాజపూజ్యం, స్వర్ణయుగం ఇప్పటికే ఎండమావే" అన్నాడు వెంకట్రెడ్డి.

"నేనేం అవమానానికి గురి కాలేదు వెంకట్రెడ్డి... నిజం... అందుకే మళ్లీ మీ ఇంటికి పోదామంటున్నాను" మిత్రుణ్ని చూస్తూ అన్నాడు ఆనందరావు.

"ఎందుకు దాస్తావు ఆనందరావ్! నీ పట్ల మా బావ, చెల్లె, అందరూ ఎంత దుర్మార్గంగా ప్రవర్తించారో నాకు తెలుసు. పైకి ఏం అనకున్నా నువ్వు ఫలానా అని తెలిసిం తర్వాత నిన్ను నిందితున్ని చూసినట్లు గుచ్చిగుచ్చి చూడటం, రాకూడని వాడు ఇంట్లోకి వచ్చినట్లు ముఖాలు మాడవడం నేను గమనించాడు. వాళ్ల ప్రవర్తనను చూస్తుంటే ముండ్ల మీద కూచున్నట్టు నాకే అనిపిస్తే నీ కెట్లా ఉంటుందో తెలియదా చెప్పు. మన రెండు కుటుంబాల సభ్యుల్లోని ప్రేమల్లో ఎంత అంతర ముందో నాకర్థమైంది. మా వాళ్లు నిన్ను చూస్తూ పరోక్షంగా అవమానికి గురి చేస్తూ వడ్డించిన మసాలా తిండ్ల కంటె మీ అమ్మ, నాన్న ప్రేమ రంగరించి పెట్టిన తిండే నచ్చింది నాకు. ఏం పెట్టావన్నది కాదు ఆనందరావ్,ఎలా పెట్టావన్నది ప్రధానం."

మిత్రుడి మాటలతో వారం రోజులుగా ఆపుకుంటున్న దుఃఖం పెల్లుబికి వచ్చింది. ఆనందరావు కళ్ల వెంట ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి.

ఆ కన్నీళ్లలో ఎన్నో ప్రశ్నలు.

ఆ ప్రశ్నలు... ప్రశ్నలు...ప్రశ్నలు...

"ఈ దేశంలో దళితులకు స్వర్ణయుగం ఎప్పుడు? ఎప్పుడు?? ఎప్పుడు???" అనే మాటలు అప్రయత్నంగా వెంకటరెడ్డి నోటి నుండీ వెలువడ్డాయి...

మరి దళితులకు స్వర్ణయుగం ఎప్పుడు?

రాజపూజ్యం ఎప్పుడు?

●

"నువ్వు నన్ను మీ ఇంటి కెందు కాహ్వానించావో అప్పుడర్థం కాలేదు. కాని ఆహ్వానించి ఉండకపోతే నేనెంతో కోల్పోయి ఉండేవాణ్ని. అక్కడ గడిపిన రెండురోజుల్లో నిజమైన ప్రేమంటే ఏంటో తెలుసుకున్నాను. నిష్కల్మషహృదయాలెలా ఉంటాయో అర్థం చేసుకున్నాను. మా ఇంట్లో, మీ ఇంట్లో గడిపిన జీవితంతో నా అభిప్రాయాల్లో చాలా మార్పులొచ్చాయి. అవును ఆనందరావ్, నువ్వన్నట్లు మీకు రాజపూజ్యం, స్వర్ణయుగం ఇప్పటికే ఎండమావే"